


# ౨౬ వ భాగం

## హిరణ్యకశిపుడు, నృసింహావతారం – ౩

దానవోద్రేకస్థంభన అయిపోయింది. ఇన్నాళ్ళూ యక్ష, కిన్నర, కింపురుష, నాగ, ఋషి, ప్రజాపతి, దేవతలనందర్నీ కాల్చుకు తిన్న దితి కొడుకుని ఏ విధంగా చావకూడదనుకున్నాడో అదే విధంగా వాడిష్ట ప్రకారమే ప్రాణం తీశాడు విష్ణువు. ఇంతమందిని కష్టాలు పెట్టిన హిరణ్యకశిపుడూ వాడి భృత్యులూ నాశనం అయ్యేరు. భృత్యులెందుకు నాశనం అయ్యారు, వాళ్ళు యజమాని చెప్పినదే కదా ఆచరించారు? దీని గురించి హిరణ్యాక్ష చరిత్రలో చూసాం ఓ సారి. భృత్యులు చేసిన తప్పుకు వాళ్ళేకాదు, యజమాని కూడా బాధ్యుడు. అదే విధంగా యజమాని చేయమంటే మంచీ చెడూ చూసుకోకుండా చేసేయడం వల్ల భృత్యులు కూడా బాధ్యులు.

ఇప్పుడు ప్రహ్లాదుణ్ణి బ్రహ్మాదులు ముందుకు తోసి ఈ కోపం తగ్గించే భారం నీదే అనేసరికి కుర్రవాడు ముందుకొచ్చాడు. అలా వచ్చిన ప్రహ్లాదుణ్ణి చూసి

ఉ. ప్రాభవ మొప్ప నుత్కటకృపామతియై కదియంగఁ జీరిఁ సం
శోభిత దృష్టిసంఘములఁ జూచుచు బాలుని మౌళి యందు లో
కాభినుతుండు పెట్టె నసురాంతకుఁ డుద్భటకాలసర్పభీ
తాభయదానశస్తము ననర్గళమంగళహేతు హస్తమున్. [7-347]

దగ్గిరకి పిలిచి కోపం తగ్గించుకుని, కరుణా హృదయుడై తలమీద చేయి వేసాడు నృసింహుడు. ఆ చేయి ఎటువంటిది? క్రూరమైన కాలసర్పానికి భయపడే వారికి అభయప్రదానం చేసేది, అనర్గళంగా శుభాలనిచ్చేది (ఉద్భటకాలసర్పభీతాభయదానశస్తము ననర్గళమంగళహేతు హస్తమున్).

వ. ఇట్లు హరికరస్పర్శనంబున భయవిరహితుండును, బ్రహ్మజ్ఞానసహితుండును, బులకితదేహుండును, సముత్పన్నసంతోషబాష్పసలిలధారా సమూహుండును, బ్రేమాతిశయగద్గదభాషణుండును,వినయ వివేక భూషణుండును, నేకాగ్రచిత్తుండును, భక్తిపరాయత్తుండును నయి య ద్దేవుని చరణకమలంబులు దన హృదయంబున నిలిపికొని కరకమలంబులు ముకుళించి యి ట్లని వినుతించె. [7-348]

హిరణ్యాక్ష వధలోనూ, గజేంద్రమోక్షంలోనూ ఓ సారి చూసాం – ఎందుకు శ్రీహరి కర స్పర్శ అవసరమైందో వాళ్ళకి. ఇక్కడకూడా అలాగే ప్రహ్లాదుడికి స్పర్శ లభించింది. అదేమిటి ప్రహ్లాదుడు ముందునుంచీ కూడా భాగవతాశేఖరుడు కదా మరి అతనికెందుకీ స్పర్శ? ఎంతటి భాగవతాశేఖరుడైనా రాక్షస కులంలో కదా పుట్టాడు? ఏ మూలనైనా ఇప్పుడు కానీ, ముందు ముందు కానీ ఇంకేమీ పాడు గుణాలు రాకుండానన్నమాట. అంటే భగవత్సాక్షాత్కారం అవుతూనే మద మోహ మాత్సర్యాలు ఏవైనా మిగిలి ఉంటే అవన్నీ పోయి బ్రహ్మ జ్ఞానం కలిగింది. గజేంద్రమోక్షంలాగానే ఇక్కడ కూడా. ఆ చేయి మీద పడగానే ఏమైంది? "బ్రహ్మజ్ఞానసహితుండును, బులకితదేహుండును....." అయ్యి ఇలా అంటున్నాడు.

మ. అమరుల్ సిద్ధులు సంయమీశ్వరులు బ్రహ్మాదుల్ సతాత్పర్య చి
త్తములన్ నిన్ను బహుప్రకారముల నిత్యంబున్ విచారించి పా
రము ముట్టన్ నుతిచేయ నోపరఁట; నే రక్షస్తనూజుండ గ
ర్వమదోద్రిక్తుఁడ బాలుఁడన్ జడమతిన్ వర్ణింప శక్తుండనే? [7–349]

సిద్ధులు, దేవతలు, బ్రహ్మ, ఈశ్వరుడూ కూడా చివరి వరకూ నీగురించి విచారించి కనుక్కోవడానికి సరిపోరే? నేను, రాక్షస వంశంలో పుట్టినవాణ్ణి, ఏమీ తెలియని బాలుణ్ణీ అయి నిన్ను కీర్తించడానికి సమర్ధుణ్ణా?

మ. ఖరదంష్ట్రా భ్రుకుటీ సటా నఖయు నుగ్రధ్వానయున్ రక్త కే
సరయున్ దీర్ఘతరాంత్రమాలికయు భాస్వన్నేత్రయున్నైన నీ
నరసింహాకృతిఁ జూచి నే వెఱవఁ బూర్ణక్రూరదుర్వారదు
ర్భర సంసార దవాగ్నికిన్ వెఱతు నీ పాదాశ్రయుం జేయవే [7–355]

నీ ఇంతటి క్రూరమైన ఆకృతి చూసి కూడా (మెడలో తండ్రి పేగులు కనిపిస్తున్నాయి ఇంకా, రక్తం అంటుకున్న జూలూ, తండ్రి వక్షస్థలం చీల్చిన గోళ్ళ తో ఇంకా భయానకంగా ఉన్నాడు ఉగ్ర నృసింహ మూర్తి) నేను బెదరను, కానీ సంసారం అనే దావాగ్ని చూసి బెదిరిపోతున్నాను. (ఎందుకంటే ఈ దావాగ్ని ఒక్కసారి పోయేది కాదు. అనేకానేక దుర్భరమైన జన్మలు ఎత్తాలి దాన్ని వదుల్చుకోవడానికి). అలా బెదిరిపోతున్న నన్ను నీ పాదాలదగ్గరకి తీసుకో.

ఉ. శ్రీమహిళా మహేశ సరసీరుహగర్భుల కైన నీ మహో
ద్దామకరంబుచే నభయదానము జేయవు; నేను బాలుఁడం
దామసవంశ సంభవుఁడ దైత్యుఁడ నుగ్రరజోగుణుండ ని
స్సీమదయం గరాంబుజము శీర్షముఁజేర్చుట చోద్య మీశ్వరా! [7–359]

మహా లక్ష్మీ, బ్రహ్మ, మహేశ్వరులికి కూడా నీ చేత్తో అభయప్రదానం చేయవే? రాక్షస వంశంలో పుట్టి ఉగ్రమైన రజస్తమో గుణాలతో ఉండే నా తలమీద దయతో చేయి వేయడం అద్భుతం కదా?

శా. సంతోషించితి నీ చరిత్రమునకున్ సద్భద్ర మౌఁగాక నీ
యంతర్వాంఛితలాభ మెల్లఁ గరుణాయత్తుండనై యిచ్చెదం
జింతం జెందకు భక్తకాముఁడ నే సిద్ధంబు దుర్లోక్యుఁడన్
జంతుశ్రేణికి నన్నుఁ జూచినఁ బునర్జన్మంబు లే దర్భకా! [7-369]

ఇలా అనేసరికి నృసింహుడు చెప్తున్నాడు. నీ నడవడీ, చరిత్రా అంతా చూసి నాకు బాగా సంతోషమైంది. నన్నూ నిన్నూ చూసినవారికి పునర్జన్మ అనేదే లేదు.

ఆ. సకలభావములను సాధులు విద్వాంసు
లఖిల భద్రవిభుఁడ నైన నన్నుఁ
గోర్కు లి మ్మటంచుఁ గోరుదు రిచ్చెదఁ
గోరు మెద్ది యైనఁగుఱ్ఱ! నీవు. [7-370]

నన్ను అనేకమంది కోరికల కోసం అడుగుతూ ఉంటారు. నువ్వు ఏదైనా కోరుకో ఇస్తాను. సరిగ్గా ఇటువంటప్పుడే భాగవతాశేఖరులు కోరే కోరికల్లోనూ, హిరణ్యకశిపుడి లాంటి వాళ్లడిగే కోరికల్లోనూ తేడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఓ సారి ధ్రువోపాఖ్యానంలో చూసాం నారదుడు "మోక్షం కొరకు భజించాలి" అని చెప్పడం. ఇక్కడ ప్రహ్లాదుడు ఏం కోరుతున్నాడో చూద్దాం.

వ. అని పరమేశ్వరుండు ప్రహ్లాదునియందుఁ గల సకామత్వంబుఁ దెలియుకొఱకు వంచించి యి ట్లానతిచ్చిన; నతండు నిష్కాముండైన యేకాంతి గావునఁ గామంబు భక్తియోగంబునకు నంతరాయం బని తలంచి యి ట్లనియె; "ఉత్పత్తి మొదలు కామాద్యనుభవాసక్తి లేని నాకు వరంబు లిచ్చెద నని వంచింప నేల? సంసారబీజంబులును హృదయ బంధకంబులు నయిన గామంబులకు వెఱచి ముముక్షుండనై సేమంబుకొఱకు నేమంబున నిన్నుం జేరితి; కామంబులును నింద్రియంబులును మనశ్శరీర ధైర్యంబులు మనీషా ప్రాణ ధర్మంబులును లజ్జాస్మరణ లక్ష్మీసత్య తేజోవిశేషంబులును నశించు; లోకంబులందు భృత్త్యు లర్థకాము లయి రాజుల సేవింతురు రాజులుం బ్రయోజనంబు లర్థించి భృత్యులకు నర్థంబు లొసంగుదు; రవ్విధంబు గాదు; నాకుం గామంబు లేదు; నీకుం బ్రయోజనంబు లే; దయినను దేవా! వరదుండ వయ్యెద వేనిఁ గామంబులు వృద్ధిఁబొందని వరంబుఁ గృపజేయుము; కామంబులు విడిచిన పురుషుండు నీతోడ సమానవిభవుం దగు నరసింహ! పరమాత్మ! పురుషోత్తమ!" యని ప్రణవపూర్వకంబుగా నమస్కరించిన హరి యిట్లనియె.
[7-371]

ఇంకా ప్రహ్లాదుడిలో కామం పోలేదనుకోండి, మళ్ళీ ఇంకో జన్మ ఎత్తాలి కదా. అందుకే శ్రీహరి అడ్డదారిలో కోరిక తీరుస్తాను కోరుకో అంటున్నాడు (సకామత్వంబుఁ దెలియుకొఱకు వంచించి). మరి ప్రహ్లాదుడు మామూలు వాడా? ఉత్పత్తి మొదలునుంచి మిగతా వాటిలో

నాకేమీ ఆసక్తి లేదు. నాకు వరం ఇస్తానని వంచించడం ఎందుకు? నాకవన్నీ వద్దు గానీ అంతగా ఇవ్వాలనుకుంటే కోరికలు కలగకుండా ఉండేటట్టు అనుగ్రహించు అన్నాడు.

మ. నిజభక్తుండవు నాకు నిన్నుఁ గనుటన్ నీ తండ్రి త్రిస్సప్త పూ
ర్వజులం గూడి పవిత్రుఁడై శుభగతిన్ వర్తించు విజ్ఞానదీ
పజితానేక భవాంధకారు లగు మద్భక్తుల్ వినోదించు దే
శజనుల్ దుర్జనులైన శుద్ధులు సుమీ సత్యంబు దైత్యోత్తమా! [7-378]

ఇప్పటికి భగవత్సాక్షాత్కారం, కోరిక కోరుకోవడం అయిపోయాయి. భగవంతుడికి తెలిసింది అసలు సిసలు భక్తుడి స్వరూపం. నీవంటి కొడుకుని కన్నాడు కనక నీ తండ్రీ, అంతకుముందు ఇరవైఒక్క రాజులూ (త్రిస్సప్త పూర్వజులం. పోతన భగవతంలో ఎక్కాలు కూడా చేర్చాడు చూసారా? ఏడు మూళ్ళు ఇరవై ఒకటేగా?) ఉద్ధరించబడ్డారు. అంటే ఒక్క మంచి కొడుకు చాలు మొత్తం కులాన్ని బాగుచేయడానికి. అదీగాక నువ్వు రాక్షసుడవనీ శుద్ధుడవు కాదనీ అనుకుంటున్నా వేమో, నా భక్తులు ఎక్కడున్నా సరే శుద్ధులే.

సీ. ఘనసూక్ష్మ భూతసంఘాతంబులోపల
నెల్ల వాంఛలు మాని యెవ్వ రయిన
నీ చందమున నన్ను నెఱయ సేవించిన
మద్భక్తు లగుదురు మత్పరులకు
గుఱి జేయ నీవ యోగ్యుఁడ వైతి విటమీఁద
వేదచోదిత మైన విధముతోడఁ
జిత్తంబు నా మీఁదఁ జేర్చి మీ తండ్రికిఁ
బ్రేతకర్మములు సంప్రీతిఁ జేయు [7-379]

తే. మతఁడు రణంబున నేఁడు నా యంగమర్శ
నమున నిర్మల దేహుఁడై నవ్యమహిమ
నపగతాఖిలకల్మషుఁ డైఁ తనర్చి
పుణ్యలోకంబులకు నేఁగుఁ బుణ్యచరిత! [7-379.1]

నువ్వు భాగవతాశేఖరుడివి కనక మరి నీ తండ్రి సంగతి ఏమౌతుందో అంటావేమో, అన్ని విషయాలలోనూ మనసు నా మీద పెట్టి నీ తండ్రికి ప్రేతకర్మలు చేయి. నా స్పర్శచేత ఆతనికి మంచి పుణ్యలోకాలు లభిస్తాయి.

మొదట్లోనే నారదుడు చెప్పేడు కదా – యుధిష్ఠిరుడితో, “కామోత్కంఠిత గోపికల్ ..” అంటూ? భగవంతుణ్ణి ఎల్లవేళలా మనసులో గుర్తుంచుకోవడం అనేది అన్నింటికన్నా ముఖ్యం. ఎలా గుర్తుంచుకున్నామనేది కాదు. అయితే భక్తితో గుర్తుంచుకోవడం అనేది అత్యంత సులభం కనకా భక్తియోగం అనేది చాలామందికి సరిపోతుంది కనకా అదే ఆపాదించబడింది మొత్తం భాగవతంలో అంతటా. “వినరో భాగ్యము విష్ణుకథ, వెనుబలమిదివో విష్ణు కథ” అనే అన్నమాచార్య కీర్తన గుర్తొస్తోందా?

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS